# సరదా

## — కె. వి. యస్. వర్మ

డాబా మీద సరోజ, కరుణాకరం ఎదురెదురుగా కూర్చున్నారు

కరుణాకరం కట్టిన లాల్చీ తెల్లగా, అమాయకత్వంలా వుంది. లుంగీ గజిబిజిగా బాతిక్ డిజైన్సుతో వుంది.

సరోజ వంటిమీది చీర పచ్చని పైరులా వుంది. ఆ చీరలో ఆమె పసరిక పాములా వుంది. బిగుతుగా అంటి పెట్టుకుని వున్న జాకెట్టు నల్లగా యిరుకు మనస్తత్వంలా వుంది.

కరుణాకరం అమెరికన్ మేగజైన్ చూస్తున్నాడు. సరోజ కరుణాకరాన్ని చూస్తోంది.

వెన్నెల వెన్నలా వుంది. వెన్నెల్లో డాబా మంచు కొండలా మెరుస్తోంది.

"కరుణ్ రేపు మన క్లబ్ యూనివర్సరీ కదూ. ఎవర్ని యిన్వైట్ చేస్తున్నారు?"

"చదరంగం ఛాంపియన్ మోహన్ గార్ని. ముందు కొంతమంది మెంబర్లు వప్పుకోలేదు. ఎలాగైతేనేం, వప్పించాను."

"రేపు నువ్వెవరితో ఆడతావు"

"మోహన్ గారితోనే. ఆయనతో ఆడితే చాలు. ఓడి పోయినా ఫర్వాలేదు. ఎన్నాళ్ళనుంచో ఆయనతో ఆడాలన్న నా కోరిక యిన్నాళ్ళకు తీరుతోంది. రేపు సాయంకాలం నాలుగు గంటలకల్లా మనం అక్కడుండాలి."

"సరే. అలాగే వెళ్దాం. నీ ఆట చూడొద్దూ. మంచు పడుతోంది పద, అరుణ లేచిందేమో, కిందికి పోదాం."

ఇద్దరూ మెట్లుదిగి హాలులోనికి వచ్చారు. హాలులోని గచ్చు నీలాకాశంలా వుంది. గచ్చుమీది పువ్వులు నక్షత్రాల్లా వున్నాయి.

డన్‌లప్ బెడ్ మీద నిద్రపోతున్న అరుణ యాపిల్ పండులా వుంది. అరుణ వేసుకున్న గౌను బంగారంలో ముంచినట్టు వుంది. నిద్రలో అరుణ - ముఖం గురించి నవ్వే నవ్వూ అమాయకతలా వుంది.

సరోజ అరుణను ముద్దుగా ముద్దు పెట్టుకుంది.

"చాలా దారుణం సరూ...."

"ఇంకా బైటుంది సార్...."

కరుణాకరానికి సముద్రమంత కాకపోయినా గోదావరంత డబ్బు వుంది. ప్రైవేటు ప్రాక్టీసుంది. డాక్టర్‌గా మంచి పేరు వుంది. సుఖాల్ని తన కాళ్ళదగ్గరకు తెచ్చుకునే తెలివితేటలున్నాయి.

సరోజకు అందం వుంది. ఆమె తండ్రికి ప్లీడరు వృత్తి వుంది. మంచి వాగ్ధాటి వుంది. సరోజ కష్టమంటే ఏమిటో తెలియకుండా పెరిగింది. పి. యు. సి. మూడేళ్ళు హాపీగా చదివింది. తర్వాత పెళ్ళి చేసుకోవాలనుకుంది. నెమ్మదిగా ఆ విషయం తండ్రికి తెలియజేసింది. డాక్టర్‌నే పెళ్ళాడతానంది. మనిషి బాగోవాలంది.

ఒకరి కొకరు నచ్చడంవల్లా, కరుణాకరం తండ్రి అడిగినంత కట్నం సరోజ తండ్రి

---

అన్నాడు హెడ్ మాష్టరు.

"ఒక్క రోజులో వంద పేపర్లు దిద్దటం కర్మ!". తెల్లవార్లూ నిద్రలేకుండా చావాల్సిందే, నిజం మాట్లాడాలనే బుద్ధి తక్కువ ప్రయత్నానికి యీ శిక్ష అనుభవించాల్సిందే తప్పదు. అనుకుంటూ దిగులుగా క్లాసుకు వెళ్ళిపోయాడు శేఖర్.

★

సంతోషంగా యివ్వడంవల్లా కరుణాకరం సరోజల వివాహం వైభవంగా జరిగిపోయింది

* * *

కరుణాకరం డాబా సుమారు రెండు కిలో మిటర్ల దూరంలో ఒక పెంకిటిల్లు వుంది అది చావ బోయే మనిషిలా వుంది. యింటి మిది పెంకులు సామాన్యుడి కోరికల్లా చెల్లా చెదురుగా వున్నాయి. తలుపులు పాతకీ కొత్తకీ మధ్య నలిగే మనుషుల్లా వున్నాయి.

ఆ యింట్లో అయిదు ప్రాణులున్నాయి, రామారావు కాంతం, వాళ్ళ పిల్లల ముగ్గురూ.

రామారావు తొడుక్కున్న పేంటు గోనె సంచిలా వుంది. షర్టు చిల్లుల కుండలా వుంది అతనికి మనసు వుండటమే కాకుండా మంచి తనం మీద నమ్మకంకూడా వుంది. గుమస్తా ఉద్యోగం వుంది. విధిని పట్టుకు యేడ్చే మనుషుల జ్ఞానంలా అతని జీతం తక్కువ. అందుచేత తీరని కోరికలు యెక్కువ.

కాంతం కట్టుకున్న చీర వెలిసిన నీలం రంగు గోడలావుంది. ఆమెని చూస్తే గుంటలు పడ్డ చీనారేకు డబ్బా గుర్తుకొస్తుంది ఆమెకు పరిస్థితుల్ని అర్థం చేసుకుని మసలే నేర్పుంది.

రామారావుకి అతని తండ్రి, వున్న రెండెకరాలూ అమ్మి చదువు చెప్పించాడు, కాంతం తల్లి వున్న ఒకయిల్లూ కూతురి పేర రాసి, రామారావుకిచ్చి పెళ్ళి చేసింది. ఇప్పుడు రామారావు తండ్రీ, కాంతం తల్లీ, దూరాలేరు పోయారు

"ఏమండీ. శీను జ్వరం పొద్దుటికి తగ్గుతుందంటారా"

"టేబ్లెట్ వేశాంకదా. తప్పకుండా తగ్గిపోతుంది"

శీను ప్రక్కలో కాంతం, ఎదురుగా వున్న మంచం మీద రామారావు పడుకుని, ఒకళ్ళొకరు ఓదార్చుకుంటున్నారు

* * *

సూర్యకిరణాలు ధరిత్రిని తాకుతూ సుతారంగా, బంగారపురజనులా వున్నాయి గాలి ప్రియురాలి నిట్టూర్పులా వెచ్చగా వుంది.

సరోజకి మెలకువ వచ్చింది కరుణాకరం పసిపిల్లాడిలా నిద్రపోతున్నాడు సరోజ సన్నగా నవ్వుకుని, బట్టలు సర్ది, అరుణని ఎత్తుకుని బాత్‌రూమ్‌కి నడిచింది.

తను ముఖం కడుక్కుని, అరుణ ముఖం కడిగి వచ్చేటప్పటికి కరుణాకరం నిద్రనుంచి లేచాడు టైమ్ చూశాడు, ఎనిమిదిన్నర. హడావుడిగా మంచం దిగి బాత్‌రూమ్‌కి నడిచాడు.

త్వరగా డ్రెస్ చేసుకుని, ఆ వీధి చివర నున్న తన హాస్పటల్‌కి కారుమీద వెళ్ళాడు.

* *

మధ్యాహ్నం మూడు గంటలైంది. రామారావు ఆఫీసర్ దగ్గర పర్మిషన్ తీసుకుని ఆతృతగా యింటికి వచ్చాడు. "ఎలా వుంది శీనుకి" అని కాంతాన్ని అడిగాడు. కాంతం కన్నీటితో "భయమేస్తోందండి" అంది

రామారావు శీనుని చూశాడు. అతనికీ భయం కలిగింది. శీను మాట లేకుండా మంచం మిద పడుకుని వున్నాడు. నోటి వెంట చొంగ కారుతోంది. కళ్ళు తేలేసేడు. కాంతానికి కంగారెక్కువయ్యింది.

"ఏమండీ వాతం కమ్మేసినట్టుంది. డాక్టరుగారి దగ్గరకు తీసుకుపోదామండీ" కాంతం కంఠం జీరవోయింది.

"మన ప్రక్కింటి జానకమ్మగారూ కరుణాకరంగారి హాస్పటల్‌కి శీనుని తీసుకెళ్ళండి. నేను స్నేహితుడ్ని అడిగి పాతిక రూపాయలు తెస్తాను, మందులకి అవ

సరం రావచ్చు." అని రామారావు వేగంగా బయటకు వెళ్ళిపోయాడు.

కాంతం జానకమ్మ శీనుతో రిక్షా ఎక్కారు. రిక్షా కరుణాకరం హాస్పటల్ వేపుకి కదిలింది.

* * *

మూడున్నర గంటల ఎండ ఎర్రగా, వేడిగా కాస్తూంది.

తన గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని అరుణకి చాలా సంతోషంగా వుంది. నెమ్మదిగా గేటు దాటింది. రోడ్డు మీదకి వచ్చింది. తనలో తాను నవ్వుకుంటూ కేరింతలు కొడుతూ పరుగెత్తింది. కొంతమంది పిల్లలు ఆడుకుంటుంటే తనూ వాళ్ళతో కలిసింది.

క్లబ్‌కి వెళ్ళడానికి తయారవుతూ కరుణాకరం "సరూ! అరుణ ఏది? కనిపించడం లేదు." అని అడిగాడు. అద్దం ముందు కూర్చుని ముస్తాబవుతూ సరోజ "అరుణా" అని పిల్చింది. జవాబు రాలేదు. మళ్ళీ పిల్చింది. పలకలేదు.

సరోజ హాలులోకి వచ్చి చూసింది. అరుణ లేదు. గదులన్నీ చూసింది. తోటలో చూసింది. అరుణ కనిపించలేదు. నౌకర్ని పిల్చింది. అరుణ వీధిలో కానీ, ప్రక్కిళ్ళలో కానీ వుందేమో చూసి రమ్మంది. నౌకరు అరుణ కోసం వీధిలో కెళ్ళిపోయాడు.

సరోజకీ, కరుణాకరానికీ ఆత్రుత ఎక్కువయ్యింది.

ఇద్దరూ గబగబా గేటు వగ్గర కెళ్ళి రోడ్ మీదకు చూశారు. పావుగంట గడిచింది.

* * *

గేటు ముందు రిక్షా ఆగింది. కాంతం శీనుని జాగ్రత్తగా పట్టుకుని రిక్షా దిగింది. ఆమెతో పాటు జానకమ్మ దిగింది. "బాబూ, నా కొడుకుని బతికించండి" అంది కాంతం కరుణాకరానికి నమస్కారం సీనుతో పాటు చేస్తూ.

కరుణాకరం కాంతం కొడుకుని చూశాడు. చిరాగ్గానే చూశాడు. కేసు సీరియస్‌గానే వుందనుకున్నాడు.

అరుణ ఎక్కడికెళ్ళిందో తెలీదు. ఈ చుట్టు ప్రక్కలే వుండి వుండాలి. నౌకరు వెళ్ళేడు కాబట్టి కొంచెం సేపటిలో నయినా తీసుకురావచ్చు. పోనీ డిస్పెన్సరీకి వెళ్తే.... కుర్రోడుకి వైద్యం చేస్తే.... మరి క్లబ్‌కి ఎప్పుడు వెళ్ళేది? మోహన్ గారితో చదరంగం ఆడటమో? హాస్పటల్లో కంపౌండరు కూడా లేడు. వాడేదో పనుండి యింటికి వెళ్తానంటే, అర్జంటు కేసులు లేక పోవడంవల్ల. తను వాడిని పంపేశాడు. క్లబ్‌కి వెళ్ళడానికి లేటయిపోతోంది. కొంప తీసి అరుణకు ఏ యాక్సిడెంటయినా .... కరుణాకరానికి మరి ఆలోచించడానికి మనస్కరించలేదు.

"చూడమ్మా. ఇంకో డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళు. నాకిప్పుడు తీరికలేదు" కరుణాకరం చాలా సౌమ్యంగా అన్నాడు.

కాంతం పెదవులు కదిలాయి.

"దయచేసి వెళ్ళమ్మా" అన్నాడు కరుణాకరం.

ఏం చెయ్యడానికీ తోచక కొన్ని క్షణాలు నిలబడి, కాంతం, జానకమ్మా వెనక్కు మళ్ళేరు, కాంతం శీను ముఖం మీద ఎండ పడకుండా పమిట కొంగు కప్పింది.

* * *

కార్లూ, రిక్షాలూ, సైకిళ్ళూ, చిన్నకార్లు, సిటీబస్సులతో మెయిన్ రోడ్ చీమలదండులా వుంది,

అరుణ అటూ యిటూ చూస్తూ నడుస్తోంది. సిటీబస్సు స్పీడుగా వస్తోంది. అరుణ అల్లరిగా నడుస్తోంది. సిటీబస్ చాలాస్పీడుగా వస్తోంది. వస్తూ వస్తూ "కుయ్యో" మంటూ సడన్ బ్రేకుతో ఆగింది.

"అయ్యో! అయ్యయ్యో!" అనుకుంటూ

జనం ఒళ్ళు జలదరింతగా బాధగా, భయంగా కళ్ళు మూసుకున్నారు కొన్ని సెకండ్ల తర్వాత నెమ్మది నెమ్మదిగా కళ్ళు తెరిచారు

వల వల వణికిపోతూ, కెవ్వు కెవ్వున ఏడుస్తూ రామారావు చేతుల్లో వుంది అరుణ. రామారావు సముదాయిస్తున్నాడు. అరుణ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

అంతలో—

అరుణను వెతుక్కుంటూ వస్తున్న కరుణాకరం నౌకరు రామారావు చేతుల్లోవున్న అరుణను చూశాడు. గబ గబా దగ్గరకు వచ్చాడు. అరుణను ఎత్తుకున్నాడు. కరుణాకరం యింటి వేపుకు నడిచాడు. అరుణ ఏడుపు ఆపింది.

రామారావుకు శీను మనసులో మెదిలాడు. డాక్టరుగారు యీ పాటికి మందిచ్చే వుంటారనుకున్నాడు. శీను నవ్వుతూ వుంటాడనే అనుకున్నాడు. జేబులోని డబ్బు జాగ్రత్తగా వుందో లేదోనని తడిమి చూసుకున్నాడు. భద్రంగానే వుంది రామారావు నాలుగడుగులు వేసేటప్పటికి కాంతం, జానకమ్మ ఎదురయారు. విషయం చెప్పారు. పది నిముషాల్లో మరో డాక్టరు దగ్గరకు వెళ్ళారు.

* *

సరోజ గేటు దగ్గర నిలబడి అరుణకోసం ఎదురు చూస్తోంది కరుణాకరాన్ని తిట్టుకుంటోంది. కన్నీళ్ళు రాబోతున్నాయి కరుణాకరం మీద కోపం పెరిగిపోతోంది. అరుణ ఏమయిందోననే ఆదుర్దా అయినా లేకుండా, క్లబ్బుకి టైము మించిపోయిందంటూ వెళ్ళిపోయిన కరుణాకరాన్ని తిట్టుకుంటోంది.

ఇంతలో –

నౌకరు చేతుల్లోని అరుణను చూసింది. సరోజ ముఖం వికసించింది అరుణను చేతుల్లోకి తీసుకుంది. గట్టిగా కౌగలించుకుంది. ప్రేమగా బుగ్గలు నిమిరింది. ఇల్లు విడిచి బయటకు వెళ్ళినందుకు అరుణను మందలించింది. కరుణాకరం మీది కోపం కరిగిపోయింది. క్లబ్బుకి వెళ్ళడానికి నౌకర్ని టాక్సీని పిలుచుకు రమ్మంది.

* * * *

డాక్టరు శీనుని పరీక్షించాడు.

"ఇంతాలశ్యంగా ఎందుకు తీసుకువచ్చా" రని కోప్పడ్డాడు. తర్వాత పెదిమ విరిచాడు.

కాంతం గొల్లుమంది.

రామారావు బావురుమన్నాడు.

వాళ్ళని ఇంటికి తీసుకు వచ్చింది జానకమ్మ.

ఏడ్చి ఏడ్చి. రామారావు శీనుని భుజం మీద వేసుకుని, కాంతి కన్నీళ్ళు లేని కళ్ళతో, పుడమితల్లి కడుపులో శీనుని పూడ్చడానికి బయలుదేరాడు.

గుమ్మానికి తల కొట్టుకుంటూ "శీనూ, నా చిట్టితండ్రీ, నూరేళ్ళు అప్పుడే నిండిపోయాయా నాయనా నీకు" అనుకుంటూ కాంతం హృదయవిదారకంగా విలపిస్తోంది.

* * *

క్లబ్బులో కరుణాకరం చదరంగం బల్ల ముందు కూర్చుని, ఒక ఎత్తువేసి, తృప్తిగా గాలి పీల్చుకున్నాడు మోహన్‌గారి వంక ఉత్సాహంగా చూశాడు. మరో ఎత్తు వెయ్యడానికి మోహన్ సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు.

సరోజ అరుణను ఒళ్ళో కూర్చోబెట్టుకుని చదరంగం బల్లవేపు ఎంతో యింటరెస్టుతో చూస్తోంది.

